కాళికాదేవి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

ఎమ్మెల్సీ కోటిరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నందికొండ, నవంబర్ 18 : నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ముత్యాలమ్మ దేవాలయంలో కాళికాదేవి అమ్మవారిని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్సీని పూర్ణ కుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అలాగే మాజీ ఎంపీ బడుగు లింగయ్యయాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం మాల ధారులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, కౌన్సిలర్ రమేశ్‌జీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి రఘువీర్, కోశాధికారి చంద్రమౌళి, డాక్టర్ అజ్మీర్, సభ్యులు శ్రీను, కృష్ణ, శ్రీనివాస్, శంకర్, వాసు, నాగార్జున, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

21న కళాకారులు, గాయకుల ఎంపిక

● ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్

మాట్లాడుతున్న ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్

రామగిరి, నవంబర్ 18 : 'నూరేళ్ల నా ఊరు' గేయ కావ్యంలో భాగస్వాములు కావడానికి 243 మంది గాయని, గాయకులు అవసరమై ఉన్నందున, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వారిని ఎంపిక చేయనున్నట్లు ప్రముఖ గేయ రచయిత, వాగ్గేయకారుడు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. నల్లగొండలోని అంబేద్కర్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేపట్టే కార్యక్రమానికి అవసరమైన కళాకారులు, గాయని, గాయకులను ఎంపిక చేసుకునేందుకు ఊరూరా తిరుగుతూ నల్లగొండకు వచ్చినట్లు చెప్పారు. కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యంలో ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు ఏవిధంగా ఉండేది.. ప్రస్తుతం ఎంత మార్పు వచ్చింది. ప్రజల మానసిక పరిస్థితుల గురించి విశదీకరించి కవి ఆత్మకతగా రాసిన సుదీర్ఘ గేయ కావ్యం అన్నారు. ఈ నెల 21న నకిరేకల్‌లోని మూసీరోడ్డులోని గీతా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కవులు, కళాకారులు, గాయని, గాయకులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. సమావేశంలో గాయకులు వేముల పుష్ప, కవి, వాగ్గేయ కారుడు అంబటి వెంకన్న, మద్దెల సందీప్, జూపాక శివ, గూడూరు మహేశ్, లతీఫ్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ, నవంబర్ 18 : డిసెంబర్-1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ గోలి సైదులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం స్థానిక జడ్పీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి నాయకులు తల్లమల్ల హుస్సేన్, కంచి మధుసూదన్, రేకల సైదులు, బొగరి విజయ్, చింతపల్లి లింగమయ్య, తెలగమల్ల యాదయ్య పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య సమావేశాలు

● డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నవంబర్ 18 : ఇందిర మహిళ శక్తి సంబురాల్లో భాగంగా ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య సమావేశాలు నిర్వహించాలని డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏలు, మహిళా సంఘుల అధ్యక్ష, కార్యదర్శులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 9 వరకు సంబురాలు కొనసాగుతాయన్నారు. ఇందులో భాగంగా సంఘంలో లేని వారిని చేర్పించాలని, రుణ, బీమా పథకాలు, ప్రమాద బీమా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో తాసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం వినోద, ఏపీఓ స్ఫూర్తి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొప్పుల జయలక్ష్మి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

తిప్పర్తి : ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీదేవి మాట్లాడుతూ డిసెంబర్ 1నుంచి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీసీలు జ్యోతి, ఎమిలియా, రేణుక, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎల్లంల సునీత, వీఓఏలు, సంఘబంధం అధ్యక్షులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు

కొండమల్లేపల్లి, నవంబర్ 18 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం పేరెంట్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలే చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా కంబాలపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ధనమ్మ, సహాయ కార్యదర్శిగా సాయికుమార్, కోశాధికారిగా సురేశ్, కమిటీ సభ్యులుగా పులిజాల ముత్యాలు, ఆర్. యాదయ్య, సీహెచ్ కృష్ణవేణి, ఎర్ర ఆంజనేయులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శౌరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● సివిల్ సప్లయ్ డీఎస్పీ వెంకటేశం

ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

మాడ్గులపల్లి, నవంబర్ 18: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలని సివిల్ సప్లయ్ డీఎస్పీ జి.వెంకటేశం సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నిర్వాహకులు కాంటాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ జావిద్, వెంకటేశ్వర్లు, సీఈఓ రవీందర్ రావు ఉన్నారు.

భూమిని ఆక్రమించిన వారిపై ఎస్పీకి ఫిర్యాదు

దామరచర్ల, నవంబర్ 18: దామరచర్ల శివారులోని 483 సర్వే నంబర్‌గల 1.24 ఎకరాల భూమిని ఆక్రమించిన ఇండియా సిమెంటు కర్మాగారం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన డి. వెంకటేశ్వర్లు సోమవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు వినతిపత్రం అందించారు. గత 40 ఏండ్లుగా సదరు భూమిని తాను సాగు చేసుకుంటున్నానని, భూమిపై కోర్టుకూడా తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని తెలిపారు. అయినా అర్ధరాత్రి పంటపొలాన్ని కర్మాగారం నిర్వాహకులు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై మానవహక్కుల సంఘానికి కూడా ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

బాధితుల ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, నవంబర్18 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా తన కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 30 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత పోలీస్ స్టేసన్‌లకు పంపించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాం జరిగేలా చూడాలన్నారు. సివిల్ కేసులన్నీ కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని, భూ సమస్యలను కోర్టు ద్వారానే పరిష్కారం చూపాలని పోలీసులు తలదూర్చితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసిన గిరిజన సంఘం నాయకులు

చందంపేట, నవంబర్ 18 : కొడంగల్ నియోజకవర్గంలో లగచర్లలో గిరిజనులపై దాడి నేపథ్యంలో వారికి మద్దతు తెలిపేందుకు వెళ్తున్న పలువురు బీఆర్ఎస్ పార్టీ గిరిజన సంఘం నాయకులను పోలీసులు సోమవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గిరిజన సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ మాట్లాడుతూ గిరిజన సంఘం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై తిరుగుబాటు ప్రారంభమైందని పేర్కొన్నారు. లగచర్ల ఘటనపై పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. అరెస్ట్‌అయిన వారిలో మాజీ ఎంపీటీసీ ఇస్లావత్ బాలవర్దరాజు, నాయకులు రాంకోటి, బలరాంనాయక్, పాండు, గోపాల్, రాజునాయక్, బిక్కు నాయక్, సీత్యానాయక్ పాల్గొన్నారు.

ఆక్రమణ దారుల నుంచి భూమిని రక్షించాలని వినతి


ఎస్పీ, కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదును చూపుతున్న సోమయ్య, అంజమ్మ

నల్లగొండ, నవంబర్ 18: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి గ్రామంలోని 620,634,635,636 సర్వే నంబర్లలో తమకున్న మూడు ఎకరాల భూమిని వెంచర్ దారులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, వారి నుంచి తమకు రక్షించాలని చర్లపల్లికి చెందిన ఎలిజాల సోమయ్య, అంజమ్మ దంపతులు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం జడ్పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏండ్ల కింద తాము భూమి కొనుగోలు చేసి సేద్యం చేసుకుంటున్నట్లు చెప్పారు. అదే గ్రామానికి చెందిన మందడి వెంకట్‌రెడ్డి, పిన్నపురెడ్డి గోపాల్‌రెడ్డి తమ భూమిని వెంచర్‌కోసం అమ్మమని ఒత్తిడి తెచ్చారని, తాము ఒప్పుకోక పోవడంతో దానిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణను అడ్డుకున్న తమను కొట్టారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికార పార్టీ నేతల అండదండతో తమను బెదిరిస్తున్నారని, వారితో తమకు ప్రాణభయం ఉందని తెలిపారు. తక్షణమే క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా అమ్మవారి విగ్రహ ఊరేగింపు

నకిరేకల్, నవంబర్ 18 : నకిరేకల్ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగం గా సోమవారం ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గర్రె రామ్మూర్తి, బ్రహ్మదేవర లక్ష్మయ్య, పద్మావతి, వీర్లపాటి రాంబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వీర్లపాటి జానయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు బ్రహ్మదేవర రమేశ్, రామ్మోహన్, నర్సింహారావు, మురళి, భక్తులు పాల్గొన్నారు.

ఫార్మా బాధిత కుటుంబాలపై దాడిచేసిన వారిని శిక్షించాలి

● జడ్పీ సీఈఓకు సేవాలాల్ సేన వినతి

జడ్పీ సీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దామరచర్ల, నవంబర్ 18: కొడంగల్ నియోజకవర్గంలోని ఫార్మా బాధిత కుటుంబాలపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీ సీఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సేన జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌నాయక్ మాట్లాడుతూ కొడంగల్ నియోజక వర్గంలోని లగచర్ల, హకీంపేటతో పాటు పలు తండాల ప్రజలు ఫార్మాసిటీకి భూములు ఇవ్వలేదనే కక్షతో అధికారులు, నాయకులు ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఫార్మాసిటీ కోసం చేపట్టిన భూ సేకరణను వెంటనే విరమించుకోవాలనీ, రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలనీ, మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాందాస్, మోహన్‌నాయక్, శ్రీనూనాయక్, దస్రూనాయక్, తులసీరాంనాయక్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న బాలకృష్ణ

నిడమనూరు, నవంబర్ 18 : మండలంలోని బంకాపురం గ్రామానికి చెందిన బూడిద శ్రీను కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నడు. నిరుపేద కావడంతో చికిత్స కోసం ఇబ్బంది పడుతుండగా దాతల నుంచి సేకరించిన రూ.62 వేలను సోమవారం అమ్మా నాన్న ఫౌండేషన్ చైర్మన్ పేలసూడి బాలకృష్ణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీను వైద్య ఖర్చుల కోసం సాయం అందించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఉన్నం చినవెంకటేశ్వర్లు, బండారు రామయ్య, సైదయ్య, రాయపాటి శ్రీను, బొంగరాల శ్రీనివాస్, చిన్న సత్యనారాయణ,

మధు, శ్రీను, బుర్రయ్య, వెంకన్న, బండి శ్రీను పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మిర్యాలగూడ, నవంబర్ 18: ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఇంట్లో అద్దెకుంటున్న కొమ్ము మౌనిక(31) కుటుంబ కలహాలతో విసుగుచెంది భర్త రమేశ్ ఇంట్లో లేని సమయంలో వంటగదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మహిళ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి, నవంబర్18 : మండల కేంద్రంలోని కామినేని దవాఖాన వద్ద ఆగి వున్న బొలేరో వాహనాన్ని కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌కు చెందిన గుర్రం బాలరాజు కుటుంబ సభ్యులతో కలిసి నకిరేకల్‌లోని తమ బంధువుల ఇంటికి కారులో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కామినేని ఆస్పత్రి ముందు 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న బొలేరోను వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో కారులో ఉన్న ఇద్దరు మహిళలకు తీవ్రంగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దాంతో వారిని చికిత్స నిమిత్తం కామినేని దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దళితులను అణిచివేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దుర్గాప్రసాద్

చండూరు, నవంబర్18: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీలో ఉన్న దళితులను అణివివేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఇరిగి దుర్గా ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకోసం పనిచేసిన దళితులను అధికారంలోకి రాగానే పార్టీ నుంచి దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం చండూరు మండలంలోని చామలపల్లి గ్రామానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వచ్చిన రోజే కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కలకొండ వెంకటయ్యను దళితుడైనందునే తొలగించారని తెలిపారు. దళితులు రాజకీయంగా ఎదుగలేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, దీనిని ఎమ్మార్పీఎస్ ఖండిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

రామగిరి, నవంబర్ 18 : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డాక్టర్ భాను తేజారెడ్డి వారికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకట్‌రెడ్డి, జిల్లా శ్రీశైలం, మండలల అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ పాల్గొన్నారు.

నేడు నల్లగొండ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నీలగిరి, నవంబర్18: నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో 11 కేవీ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ వేణుగోపాలాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గొల్లగూడ, బస్టాండ్, పద్మావతీకాలని, ఆర్టీసీ కాలని, బీటీఎస్, మిర్యాలగూడరోడ్, డాక్టర్స్ కాలనీ, పాతబస్తీ, జామామసీద్, హౌసింగ్‌బోర్డు కాలనీ(మునుగోడు రోడ్డు), ఉస్మాన్‌పుర, హనుమాన్‌నగర్, మాధవనగర్, స్టార్ ఫంక్షన్‌హాల్, బొట్టుగూడ, గుండ్లపల్లి క్రాస్‌రోడ్, హిమగిరికాలనీ, గోకుల్‌నగర్, బ్లూహిల్స్ కాలనీ, అసద్‌నగర్, క్లాక్‌టవర్, శ్రీనగర్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు(ఎన్జీ కళాశాల), తులసీనగర్, జమ్మలగూడ, లైన్‌వాడ, ఖాజాబౌలి, శ్రీకృష్ణనగర్, డీవీకే రోడ్డు, చైతన్యపురి కాలనీ, గణేశ్‌నగర్, లెప్రసీ కాలనీ, సాయినగర్, అబ్బాసియా కాలనీ, పోతుగడ్డ, రెహమాన్‌బాగ్, ఇస్లాంపుర, రైతుబజార్, పంజేషా, ముత్యాలమ్మ కాలనీ, అబ్బాసియాకాలనీ-2, సిమెంట్ రోడ్డు, అక్కచెల్మ, సిదార్థకాలనీ, శ్రీరామ్‌నగర్‌కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి'

చందంపేట, నవంబర్ 18 : చందంపేట మండలంలోని రేకులగడ్డతో పాటు పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని రేకులగడ్డ గ్రామానికి చెందిన బాణావత్ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించారు. తమ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలు ఉచిత బస్సు సదుపాయాన్ని పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వాహనాలు జీపులు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. దాంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

19,641 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

● సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ, నవంబర్ 18: మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు సుమారు 19,641 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యంలో 18,798 క్వింటాళ్లు దొడ్డురకం ధాన్యం కాగా, 846 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం ఉందన్నారు. రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల దరఖాస్తు గడువు పెంపు

మిర్యాలగూడ డివిజన్‌లో ఖాళీగా ఉన్న 30 రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే, వరి కోతల కారణంగా గడువు పొడిగించినట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

నార్కట్‌పల్లి పట్టణ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, నవంబర్18 : నార్కట్‌పల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పట్టణ కేంద్రంలోని మసీదు వెనుక వైపు రూ.4లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులు, ఖబ్రస్థాన్ ప్రహరీ, రాశీ ఫ్యాక్టరీ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య యాదవ్, నాయకులు సట్టు సత్తయ్య, బత్తుల ఊషయ్య, భూపాల్ రెడ్డి, భరత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మండలంలోని చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన వస్కుల నరసింహ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దాంతో అతడికి ఎమ్మెల్యే వీరేశం రూ. 50 వేలు పంపించగా సోమవారం గ్రామ మాజీ సర్పంచ్ దాసరి రాజు అందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బొక్కమంతల పహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంగశాయిరెడ్డి

నిడమనూరు, నవంబర్ 18 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ యడవల్లి రంగశాయిరెడ్డి సూచించారు. మండలంలోని ఇండ్లకోటయ్య గూడెం, బొక్కమంతల పహాడ్, నందికొండ వారి గూడెం గ్రామాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలను సోమవారం నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, అంకతి వెంకటరమణ, యడవల్లి నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య, ఏపీ ఎం లక్ష్మీ నారాయణ, సీసీ యాదయ్య పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

హాలియా : అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. ఏఓ సరిత, నాయకులు పాల్గొన్నారు.

బీసీ సమరభేరి సభను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ, నవంబర్ 18: ఈ నెల 25న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే బీసీ సమరభేరి సభను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన ఏర్పాటు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, చిలకల మురళీయాదవ్, మహేశ్వరం నరేశ్, సిద్ధం రాజు, బోయిన ఉపేందర్, హరి పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టిన ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, నవంబర్ 18: విద్యార్థులతో గుంజీలు తీయించి, వాతలు పడేలా కొట్టిన త్రిపురారం మండల కేంద్రంలో ఉన్